క్లుప్తంగా

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రస్తుతం డయేరియా ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య శాఖ అధికారులు జిల్లాలో విస్తృతంగా వైద్య శిబిరాలు నిర్వహించాలని భారత ప్రజాతంత్ర యువ జన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి వీర నాల శివకుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద వున్న జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాతావరణ పరిస్థితుల మార్పు, దోమల వలన వ్యాధులు విజృంభిస్తున్నాయన్నారు. జిల్లాలో కలుషిత నీరు, ఫుడ్ పాయిజన్ వలన ప్రజలు ఆస్పత్రులపాలవుతున్న సంఘటనలు ఉన్నాయన్నారు. ఇటువంటి తరుణంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గ్రామీణ ప్రాంతాలు, స్కూల్స్, హాస్టల్స్‌లలో రెగ్యులర్ మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు విజయ్, సురేష్ పాల్గొన్నారు.

వైవీయూకు వీసీ, రిజిస్ట్రార్‌లను నియమించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : యోగి వేమన విశ్వ విద్యాలయానికి రెగ్యులర్ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ లేకపోవడం వలన వర్సిటీ పాలన గాడి తప్పిందని వెంటనే ప్రభుత్వం స్పందించి వీసీ, రిజిస్ట్రార్‌ల నియామకం చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్సిటీలో 20కి పైగా పీజీ కోర్సులు, పరిశోధనలు, జిల్లా వ్యాప్తంగా డిగ్రీ, లా, బీఎడ్, ఒక ఇంజనీరింగ్ కాలేజీతోపాటు అనుబంధంగా అనేక కళాశాలలు ఉన్నాయన్నారు. వీటిపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ ఉండాలంటే రెగ్యులర్ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌ల నియామకం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి కే శివశంకర్, నగర ఉపాధ్యక్షుడు అకిరానంద్, తేజ, అశోక్, చంద్ర, పహిద్, రాజేష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



వృద్ధాశ్రమానికి బియ్యం ప్యాకెట్లు అందజేస్తున్న దాతలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని బృంద వృద్ధాశ్రమంలో దివంగత జితేంద్రకుమార్ సంస్మరణగా ఆదివారం ఆయన బంధువు, న్యాయవాది బాలాజీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జితేంద్రకుమార్ కుటుంబ సభ్యులు వృద్ధాశ్రమానికి రెండు ప్యాకెట్ల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, లోకేష్, మహేష్, భరత్, వృద్ధాశ్రమ మేనేజర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రామాంజనేయరెడ్డి

కడప రూరల్: ఉచిత వైద్య శిబిరాల వలన గ్రామీణ పేదలకు మెరుగైన వైద్య సేవలు లభిస్తాయని రామాస్ శ్రీకర ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ రామాంజనేయరెడ్డి తెలిపారు. ఆదివారం చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆయన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు ఉచితంగా వైద్య చికిత్సలను అందించారు. నరాలు, ఎముకల వైద్యులు డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ ద్వారా లభించే వైద్య సేవలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రరామాస్, బీసీఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మీడియాన్ని కొనసాగించాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంతోపాటు తెలుగు మీడియాన్ని కొనసాగించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు పాఠశాలలు తమకు నచ్చిన భారతీయ భాషను బోధనా మాధ్యమంగా ఎంపిక చేసుకునే వెసులుబాటును సీబీఎస్ఈ ఇటీవల కల్పించిందన్నారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇంగ్లీష్ మీడియంతోపాటు తెలుగు మీడియాన్ని ప్రవేశపెట్టాలన్నారు. అలాగే పెండింగ్ డీఏలతోపాటు 12వ పీఆర్సీ నిధులను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ శేషగిరిరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్‌బాబు, ఎం. గంగరాజు, కట్టా గంగాధర తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం పెరగాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు రఘునాథరెడ్డి, వ్యవస్థాపక నాయకుడు డాక్టర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో జేవీవీ ప్రొద్దుటూరు పట్టణ వార్షిక ప్లీనం సమావేశం జరిగింది. కార్యక్రమంలో జేవీవీ నాయకులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

వల్లూరు : హిందూ ముస్లింలందరూ కలిసికట్టుగా జరుపుకొనే మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇది పేరుకు ముస్లింల పండుగైనా పలు గ్రామాల్లో హిందువులు కూడా సంక్రాంతి, ఉగాది, దీపావళి, దసరాలతో సమానంగా ప్రాధాన్యతనిస్తూ జరుపుకొంటున్నారు. కుల మతాలకతీతంగా వెండి, ఇత్తడి పంచలోహాలతో ఎవరి శక్తి కొద్ది వారు మొక్కుల రూపంలో పీర్లను తయారు చేయించి ప్రార్థనలు చేయడం విశేషంగా చెప్పుకోవచ్చు. తాము చేయించిన పీర్లకు ఏటా మొహర్రం సందర్భంగా భక్తులు పూలు, బట్టలు అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ఏటా మొహర్రం నెలలో నెలవంక కన్పించిన మూడవ రోజు.. అంతవరకు పెట్టెలో భద్రపరిచిన పీర్లను నిర్వాహకులు దించి, శుభ్రపరిచిన అనంతరం చదివింపులు చేసి ప్రత్యేక ప్రార్థనలతో పీర్ల చావిడిలో నిలుపుతారు. నిర్దేశిత దినాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో పీర్లను ఊరేగిస్తారు. ఈ సందర్భంగా చక్కెర, పప్పులు, బొరుగులు, బెల్లంలను భక్తులు చదివింపులుగా అందజేసి, అనంతరం అందరికీ పంచి పెడతారు. ఈ పర్వదినాలలో చివరి మూడు రోజులు ముఖ్యమైనవి. పీర్ల ముందు అగ్నిగుండాలు ఏర్పాటు చేస్తారు. గ్రామోత్సవాల అనంతరం పీర్లను మోస్తూ అందులో నడుస్తారు. మొహర్రం రోజు ఉదయం పీర్లు సలాములందుకుంటాయి. అనంతరం సాయంత్రం అమరులైన పీర్లను తిరిగి ఊరేగించి రకరకాల వేషధారణలు, కర్రసాములతో ఒకరిపైనొకరు గంధం, రంగులు చల్లుకుంటూ పండుగను వైభవోపేతంగా నిర్వహిస్తారు.



వల్లూరులో కొలువు దీరిన పీర్లు

పానకం కడవలతో నైవేద్యం

పెద్దగుండం, చిన్నగుండం కాలే రెండు రోజులు భక్తులు తమ గృహాల నుంచి డప్పులు, మేళ తాళాలతో పానకం కడవలను పీర్ల చావిడి వద్దకు తెచ్చి పీర్లకు చదివింపులు ఇచ్చి నైవేద్యాన్ని అందరికీ పంచి మొక్కులు తీర్చుకుంటారు. దీనివల్ల తమ కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. వల్లూరు మండలంలోని వల్లూరు, పెద్దపుత్త, తప్పెట్ల, దిగువ పల్లె తదితర గ్రామాలతోపాటు జిల్లాలోని పలు గ్రామాల్లో హిందూ ముస్లింలు కలిసికట్టుగా ఈ వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు.

విశిష్టత

ముస్లిం క్యాలెండర్ హిజ్రీ ప్రకారం 12 మాసాలలో మొహర్రం మొదటి నెల. ఈ నెలలో నెలవంక కనిపించిన మూడవ రోజునుంచి మొహర్రం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఇస్లాం మత ధర్మం కోసం దేవుని మార్గంలో ప్రాణాలర్పించిన త్యాగమూర్తిగా హజరత్ ఇమామ్ హుసేన్ నిలిచాడు. మహమ్మద్ ప్రవక్త ముని మనవడైన ఆయనను స్మరించుకుంటూ ఈ ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మొహర్రంను పీర్ల పండుగ అని కూడా పిలువడం పరిపాటి. ఈ నెల 18న మొహర్రం పండుగను జరపడానికి నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశారు.



ఎగువ లింగాలలో పీర్లను ఊరేగిస్తున్న ప్రజలు

ప్రారంభమైన కార్యక్రమాలు

లింగాల : లింగాలలో ఆదివారం మొహర్రం వేడుకలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. గ్రామ ప్రజలు పీర్లను ఎత్తుకుని గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా భక్తులు ఇచ్చే చెక్కర చదవింపులు చేస్తూ లింగాల, మండలంలోని ఎగువ, దిగువ, లింగాలలో గ్రామోత్సవం నిర్వహించారు.

గంగమ్మకు విశేష పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బొగ్గలేటిపల్లి కొత్తపేట సమీపంలో గల గంగమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలు, పూలమాలలతో గంగమ్మ తల్లిని విశేషంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి పి.సురేష్‌కుమార్‌రెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో గల సాయిబాబా, ఆంజనేయస్వామి, అక్కదేవతలు, వీరభద్రస్వామి, వైద్యనాథేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోర్కెలు తీర్చే తల్లి అచ్చవెల్లి గంగమ్మ

పులివెందుల రూరల్ : కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా అచ్చవెల్లి గంగమ్మ ఎంతో ప్రసిద్ధి చెందారు. పులివెందుల మండల పరిధిలోని అచ్చవెల్లి గ్రామ సమీపంలో వెలసిన అచ్చవెల్లి గంగమ్మకు ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి పులివెందులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలే కాక కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మానసిక వ్యాధుల నివారణపై అవగాహన పెంచుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న మానసిక వైద్యులు



కడప ఐఎంహెచ్‌లో పీజీల సీఎంఈ కార్యక్రమం ప్రారంభిస్తున్న వైద్యులు

కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ

కడప అర్బన్: మానసిక వ్యాధుల నివారణ పట్ల ప్రత్యేకంగా అవగాహన పెంచుకోవాలని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ తెలియజేశారు. రాయలసీమ జోన్‌కు సంబంధించి మానసిక వ్యాధుల పీజీల సీఎంఈ కార్యక్రమం కడప మెంటల్ హెల్త్ హాస్పిటల్ ఆవరణంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కడప వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ మాట్లాడుతూ మానసిక వ్యాధులు, సమస్యల గురించి అవగాహన పెంచుకునేందుకు సైక్రియాట్రి పీజీలు, సైక్రియాట్రి వైద్యులతో సీఎంఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇందులో ప్రధానంగా శారీరక వ్యాధుల వల్ల వచ్చే మానసిక సమస్యలకు సంబంధించి సీనియర్ ప్రొఫెసర్లు అవగాహన కల్పించేందుకు విచ్చేయడం ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధుల వలన వచ్చే సమస్యలను కూడా చర్చిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కడప జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డి, ఐఎంహెచ్, కడప సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు, నోడల్ ఆఫీసర్ కర్నూలు జీజీహెచ్ డాక్టర్ నాగేశ్వరరావు, పులివెందుల జీజీహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్‌రెడ్డి రాయలసీమ జోన్‌లో వున్న ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల సైక్రియాటిక్ పీజీలు, ఐఎంహెచ్ డాక్టర్లు, పీజీలు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో ఆదివారం ఆలయ ఉత్సవాలలో భాగంగా శ్రీ విజయదుర్గ, మల్లికార్జున స్వామి శాంతి కల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారి మూలమూర్తికి పంచామృతాభిషేకం, అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించి వధూవరులుగా అలంకరించారు. ఆలయ మండపంలోని శ్రీ చక్ర సన్నిధిలో ప్రత్యేక పీఠాలపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అర్చకులు కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. అనంతరం కల్యాణకర్తలకు ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ ఆలయ మర్యాదలతో అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందచేశారు. 21వ తేదీన ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తామన్నారు.



దుర్గ, మల్లికార్జునుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జూనియర్ వైద్యుల నిరసన



కడప రిమ్స్ ఆవరణంలో నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ డాక్టర్స్

కడప అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా విధుల్లో వున్న వైద్యులు, జూనియర్ వైద్యులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఏపీ జూనియర్ డాక్టర్స్ కడప విభాగం వారు ఆదివారం ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణంలో ఆందోళన చేపట్టారు. ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఖదీర్ అహమ్మద్, ఉపాధ్యక్షుడు డాక్టర్ అశ్విని, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి మణిదీపక్ ఆధ్వర్యంలో జూనియర్ డాక్టర్స్ నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విధుల్లో వున్న వైద్యులపై దాడులు చేయడం తగదన్నారు. దీంతో పాటు నెలలుగా ఉపకారవేతనం అందడంలేదని పేర్కొన్నారు. ఏపీ జూడా కడప సభ్యులు, ఏపీజూడా రాష్ట్ర కమిటీకి తమ మద్దతును అందించారు.

ఆర్టీసీ అధికారుల చొరవ

కడప కోటిరెడ్డి సర్కిల్ : అన్నమయ్య జిల్లా నందలూరు వద్ద శనివారం రాత్రి 11.30 సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు ఆర్టీసీ అధికారులు సేవలందించారు. కడప రిమ్స్‌కు తరలించే చర్యలు చేపట్టారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు, ఆర్ఎం పొలిమేర గోపాల్‌రెడ్డితోపాటు ఇతర అధికారులు పరామర్శించారు. కండక్టర్ రాముడు మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేకంగా సూపర్‌వైజర్లను నియమించారు.

జీపీఎస్ అమలుపై ఇచ్చిన గెజిట్‌ను రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్: సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రాజపత్రాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ 1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తలరాజు, రాళ్లపల్లి అబ్దుల్లా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఏర్పడిన కూటమి ప్రభుత్వం జీపీఎస్ అమలుకు సంబంధించిన రాజపత్రాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వీరాంజులరెడ్డి మాట్లాడుతూ జీపీఎస్ అమలు విధానానికి సంబంధించిన రాజపత్రాన్ని వెంటనే రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సీపీఎస్ ఉద్యోగ సంఘాలతో సీఎం, డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి చర్చించి ఉద్యోగులకు మేలు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీటీఎఫ్ ఉపాధ్యక్షులు సానం ఈశ్వరరెడ్డి, నాగభూషణంలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కాసిం వల్లి, జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, నాయకులు పాల్గొన్నారు.



గెజిట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఘనంగా ఆషాఢ గుప్త నవరాత్రులు



చండీహోమం నిర్వహిస్తున్న వేద పండితులు

జమ్మలమడుగు పట్టణంలో ఆషాఢ గుప్త నవరాత్రుల మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. పట్టణంలోని గ్రంథే సోమేశ్వరస్వామి ఆలయంలో రోజూ లలితా సహస్రనామాలు, ఖడ్గనామాలు, వారాహి అష్టోత్తరం, కుంకుమార్చన, మహామంగళ హారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం చండీహోమాన్ని గడియారం గిరినాథశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

– జమ్మలమడుగు

వైభవంగా గజపూజ మహోత్సవం



ఆకట్టుకున్న మహిళల కోలాట ప్రదర్శన

పులివెందుల మండల పరిధిలోని యర్రబల్లె పంచాయతీలో ఉన్న మల్లికార్జునపురం గ్రామంలో ఆదివారం గజపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో గజపూజ నిర్వహించారు. గ్రామంలో చెక్క భజనలు నేర్చుకుని నెలరోజుల తర్వాత గజపూజ కార్యక్రమాన్ని గురువులు, మస్తాన్, కిషోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పెద్దలు, పిల్లలు, మహిళలు గజపూజలో పాల్గొని చెక్కభజనలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీగా తరలి వచ్చారు.

– పులివెందుల రూరల్

ఆరోగ్యమాత సహాయ డైరెక్టర్‌గా మహేష్



సహాయ డైరెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న విశ్వాసులు

కడప కల్చరల్ : కడప నగరం రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రముఖ క్రైస్తవ ఆరోగ్యమాత క్షేత్రానికి నూతన సహాయ డైరెక్టర్‌గా పిల్లి మహేష్‌ను నియమించారు. ఆదివారం శాంతి సేవ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, పలువురు విశ్వాసులు చర్చిలో ఆయనను కలిసి శాలువ, పూలమాలలతో సత్కరించి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పిల్లి మహేష్ మాట్లాడుతూ మరియతల్లి సన్నిధిలో సేవలు అందించడం తన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సెప్టెంబరులో జరిగే మరియ తల్లి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్, మనోహర్, ప్రవంతి, అమృత తదితరులు పాల్గొన్నారు.

బుక్‌లెట్స్ విడుదల



బిట్స్ బుక్‌లెట్స్‌ను విడుదల చేస్తున్న జేఏసీ చైర్మన్ శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్: ఏపీటీఎఫ్ అమరావతి ఆధ్వర్యంలో తయారు చేసిన బిట్స్ బుక్‌లెట్స్‌తో డిపార్టుమెంట్ పరీక్షలలో సులభంగా ఉత్తీర్ణత సాధించవచ్చని జేఏసీ చైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం కడప ఎన్‌జీఓ భవన్‌లో డిపార్టుమెంట్ పరీక్షల బిట్స్ బుక్‌లెట్స్‌ను ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసులు ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సివి ప్రసాద్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ శివార్జునలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపార్టుమెంట్ పరీక్షలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు చాలా కీలకం అన్నారు. ఉత్తీర్ణత సులభతరం అయ్యే విధంగా ఏపీటీఎఫ్ అమరావతి ఆధ్వర్యంలో బిట్స్ బుక్‌లెట్స్ తీసుకు రావడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అమరావతి ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఈశ్వరచంద్ర, అలీఖాన్, చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు ఉమాకాంత్, వెంకటసుబ్బయ్య, వీరప్రసాద్, సత్యం, పద్మజతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పుష్పగిరి ఆలయ శిల్పాలపై అధ్యయనం



పుష్పగిరి ఆలయంలోని శిల్పకళా సంపదను అధ్యయనం చేస్తున్న కోట మృత్యుంజయరావు

వైవీయూ : పుష్పగిరి చెన్నకేశవ ఆలయంలోని శిల్ప సంపదపై వైవీయూ లలితకళల విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు అధ్యయనం చేపట్టారు. కవి భారవి రచించిన కిరాతార్జునీయం అన్న అంశంపై పరిశోధన వ్యాసం నిమిత్తం ఆదివారం పుష్పగిరి చెన్నకేశవ ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ ప్రాకారంలోని శిల్పసంపదను పరిశీలించి కీలకమైన ఘట్టాలపై ఆయన అభిప్రాయాలు వెల్లడించారు. పుష్పగిరి లో అద్భుతమైన శిల్పకళా సంపద ఉందని, దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లేపాక్షి దేవాలయంలో కిరాతార్జునీయం కథను ఒకే గోడపై చెక్కగా పుష్పగిరి ఆలయంలో చాలా చిన్న పరిణామంలో, కీలకమైన ఘట్టాలను ఒక్క చోటనే కాకుండా ఆలయ అధిష్ఠానం మరియు, నాలుగు దిక్కుల గోడలపై 5 ఘట్టాలను చెక్కారన్నారు. వీటితో పాటు శ్రీమహావిష్ణువు, వృషభారూఢమూర్తి, నటరాజు, అంధకాసురమూర్తి, నాట్యగణపతి, రామలక్ష్మణులు, వరహామూర్తి తదితర అద్భుతమైన శిల్పాలు ఉన్నాయన్నారు. విజయనగర శిల్పకళా వైభవం, హోయసల, చోళ శిల్పశైలి మిళితమై కనిపిస్తాయన్నారు.

గోల్డ్ మెడల్ సాధించిన గాన శ్రేయ



గాన శ్రేయకు బంగారు పతకం అందచేస్తున్న గీతం యూనివర్సిటీ వీసీ, అధికారులు

కడప ఎడ్యుకేషన్: కడప నగరం సమగ్రశిక్ష కార్యాలయంలో సెక్టోరియల్ అధికారిగా పనిచేస్తున్న కొండా దశరథరామిరెడ్డి, రాధ దంపతుల కుమార్తె కుమారి గాన శ్రేయ ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్‌ను సాధించింది. గాన శ్రేయ బెంగళూరు గీతం విశ్వవిద్యాలయంలో బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(బిబిఏ) చదువుతోంది. బెంగుళూరు, వైజాగ్, హైదరాబాద్‌లోని మూడు గీతం యూనివర్సిటీల పరిధిలో వరుసగా మూడు సంవత్సరాల పాటు అత్యధిక గ్రేడ్ మార్కులను సాధించినందుకుగాను గాన శ్రేయను ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్‌కు ఎంపిక చేశారు. గాన శ్రేయ తన మూడేళ్ల కోర్సులో మూడు యూనివర్సిటీల పరిధిలో అత్యధికంగా 9.64 గ్రేడ్‌ను సాధించింది. ఇందుకుగాను ఈ నెల 13వ తేదీ బెంగుళూరులో గీతం యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో గానశ్రేయకు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్‌తోపాటు కళాశాల యాజమాన్యం బంగారు పతకంతోపాటు ప్రశంసాపత్రాన్ని ప్రదానం చేసి అభినందించారు.